క్లుప్తంగా

శివను అభినందించిన ఢిల్లీ మాజీ సీఎం



కల్వకుర్తి రూరల్: చిన్న వయసులోనే సామాజిక సేవలు చేయడంతో పాటు జాతీయ యువజన అవార్డు సాధించిన స్వామి వివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివకుమార్‌ను గురువారం ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి అతిషీ మార్లేనా అభినందించారు. సేవా కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆమెకు అందించగా పరిశీలించి శివను అభినందిస్తూ మరిన్ని సేవలను విస్తరించాలని సూచించారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడు ఎంపిక

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్ జాతీయ స్థాయిలో నిర్వహించే విద్యా శిక్షణకు ఎంపికయ్యాడు. నూతన విద్యా విధానం 2020 కార్యక్రమంలో భాగంగా బోధన అభ్యసన ప్రక్రియలను ఆసక్తిగా మార్చుటకు 'విద్యలో పప్పెట్రి పాత్ర' అనే అంశంపై ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10 తేదీ వరకు 15 రోజులపాటు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్ సీసీఆర్‌టీ సెంటర్‌లో జరగనున్న జాతీయ స్థాయి విద్యా శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేష్ పాల్గొనున్నాడు. రాష్ట్రంలో 10 మంది ఉపాధ్యాయులను ఎంపికయ్యారని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. తోటి ఉపాధ్యాయులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను అభినందించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు అరికట్టాలి

ఊర్కొండ: మండల కేంద్రంతోపాటు ఊర్కొండ పేట శివారులోని గుట్టలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ పేరుతో గుట్టలపై పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారి పొట్టకట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కొమ్ము రాజయ్య, వడ్డెర ప్రతినిధులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి

కొల్లాపూర్ రూరల్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు విమర్శించారు. గురువారం మండలంలోని రామాపురంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ స్పష్టమైన వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యా సామర్థ్యాలను పెంచాలి

కొల్లాపూర్: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచాలని మండల విద్యాధికారి ఇమ్మానుయేల్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులకు లైబ్రరీ ఆవశ్యకత గూర్చి వివరించారు. విద్యార్థులకు ఆసక్తికరమైన కథల పుస్తకాలు ఇచ్చి పుస్తక పఠనం పెంపొందేవిధంగా చూడాలన్నారు. మానసిక వికాసం, ఆలోచన పెంచే సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వనజ, శోభారాణి, రిసోర్స్‌పర్సన్‌లు చంద్రారెడ్డి, కురుమయ్య, రాజేష్, సతీష్, సీఆర్‌పీలు వెంకటస్వామి, రామకృష్ణ ఉన్నారు.

ఆయుర్వేదిక్ డాక్టర్ చంద్రసింగ్ బాధ్యతలు

వెల్దండ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుర్వేదిక్ డాక్టర్ చంద్రసింగ్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ శ్రీదేవి బదిలీపై హైదరాబాదు వెళ్లారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి నుంచి బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

సగరులు రాజకీయాల్లో రాణించాలి

కల్వకుర్తి రూరల్: సగరులు రాజకీయాల్లో రాణించాలని సగర సంఘం జిల్లా కోశాధికారి పడకంటి రాజు సాగర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గాంధీ నగర్‌లో ఉన్న సగర కమ్యూనిటీ భవనంలో 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే సగర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. రాజకీయంగా ఎదిగేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకోవాలని రాజుసాగర్ కోరారు. కార్యక్రమంలో సురేష్, రాజు, హరికృష్ణ, శ్రీనివాసులు, జంగయ్య, యాదగిరి, అరుణ్, తిరుపతయ్య, బాలయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

సాగునీరు విడుదల.. రైతన్న హర్షం

- జొన్నలబొగుడ రిజర్వాయర్ ఆయకట్టు రైతుల సంబురం
- కృష్ణమ్మ నీటితో నిండుతున్న చెరువులు, కుంటలు

కోడేరు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి వారం రోజుల కిందట సాగునీరు విడుదల చేశారు. కాల్వల ద్వారా కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఆయకట్టు రైతులు సంబురం వ్యక్తం చేస్తున్నారు. కాల్వ నుంచి గ్రామాల్లోని చెరువులకు, కుంటలకు రిజర్వాయర్ నీటితో నింపనున్నారు. ఇదివరకే పలుగ్రామాల్లోకి చెరువులకు జలకళ సంతరించుకుంది. చెరువులకు నీరు చేరుతుండటంతో ఆయా గ్రామాల రైతులు సాగు చేసిన పంటలకు ఇక జీవం పోసినట్లయింది. ఈ ఏడాది సరిపడా వర్షాలు కురియక పోవడంతో దిగాలు చెందుతున్న సమయంలో సాగునీరు విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 750 వరకు క్యూసెక్కుల నీరు విడుదల

జొన్నలబొగుడు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 2.14 టీఎంసీలు కాగా మొత్తం రెండు తూములు ఏర్పాటు చేశారు. ఒక్కో తూము నుంచి ప్రతి రోజు ప్రస్తుత నీటి నిల్వ 350 నుంచి 400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మండలంలో మొత్తం చెరువులు, కుంటలు కలిపి 221 ఉండగా అందులో పెద్ద చెరువులు 6, చిన్న చెరువులు 215 ఉన్నాయి. పస్పుల, జనుంపల్లి, కొండ్రావుపల్లి, ఎత్తం, రాజాపూర్ మాచ్‌పల్లి పెద్ద చెరువులు ఉన్నాయి.



వరినాట్ల కోసం కరిగెట చేస్తున్న రైతు

వరి, ఆరుతడి పంటలవైపు మొగ్గు

మండలంలోని కోడేరు, పస్పుల, రాజాపూర్, ముత్తిరెడ్డిపల్లి ఎత్తం, నాగులపల్లి, కొండ్రావుపల్లి, నర్సాయిపల్లి తదితర గ్రామాలకు కేఎల్‌ఐ కాలువల ద్వారా సాగునీరు రావడంతో రైతులు వివిధ పంటలను సాగు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసుకుంటున్నారు. జొన్నలబొగుడ ద్వారా సాగునీరు విడుదల కావడంతో బోరు బావుల్లో నీటిమట్టం పెరుగనుంది. బోరు బావులు లేని రైతులు కాలువల్లో సాగునీటి కోసం మోటార్ల ద్వారా తమ పొలాలకు సాగునీరు అందిస్తున్నారు.



కాలువల ద్వారా ప్రవహిస్తున్న సాగునీరు



జొన్నలబొగుడ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న సాగునీరు

సంతోషంగా ఉంది



కేఎల్‌ఐ కాలువల ద్వారా సాగునీరు చేయడంతో సంతోషంగా ఉంది. పంటలు ఎండుతున్న దశలో నీటిరాకతో మొక్కలకు జీవం పోసినట్లయ్యింది. గ్రామంలో చెరువు నిండితే ఎంతో మంది రైతులకు మేలు చేకూరనుంది. ఆయా పంటలు అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. అధికారులకు కృతజ్ఞతలు.

– స్కైలాబ్, కోడేరు

సాగునీరు సద్వినియోగం చేసుకోవాలి

మండలంతో పాటు పాన్‌గల్లు, వివిధ గ్రామాలకు సాగునీరు విడుదల చేశాం. మండలంలో మొత్తం 16,728 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అధికంగా వరి, మినుములు, వేరుశనగ, మొక్కజొన్న పంటలు వేశారు. రైతులు సాగునీరును సద్వినియోగం చేసుకోవాలి. పంటలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మి, ఏఈ

పాఠాలు అర్థమయ్యేలా బోధించాలి



వెల్దండ: విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాల దశలో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించాలన్నారు. గ్రంథాలయ పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని కోరారు. ఎల్‌ఎఫ్‌ఎల్ నూతన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, లక్ష్మణ్, ప్రేమకుమారి ఉన్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం

పెద్దకొత్తపల్లి: పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని ఎంఈఓ కొత్త శ్రీనివాసురెడ్డి అన్నారు. మండలంలో గురువారం పెద్దకారుపాముల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాల పంపిణీ మొదలైన అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయాన్ని ఉపాధ్యాయులకు ఎంఈఓ వివరించారు. ఈ ఏడాది మూతపడిన మూడు పాఠశాలలను తిరిగి తెరిపించినట్లు పేర్కొన్నారు. పెద్దకారుపాములలో గాంధీనగర్ పాఠశాలలో అత్యధిక 34 మంది విద్యార్థులను చేర్పించిన హెచ్‌ఎం సాయిప్రకాశ్‌రెడ్డిని శాలువాతో ఎంఈఓ సన్మానించారు. శిక్షణ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం జీయాహోద్దీన్, ఆర్పీలు సాయిప్రకాశ్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యువకులు



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న మైదానంలో గురువారం వాకర్స్, ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, క్రికెట్ క్రీడాకారులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో మేము సైతం భాగస్వామ్యం కావడంతో పాటు చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. వివేకానంద, శ్రీనివాసులు, నరేష్ గౌడ్, మహేశ్వర్ రెడ్డి, సాయికుమార్, మల్లేష్, వంశీ, నందకిషోర్, నక్క శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో గురువారం త్యాగరాజ నాయీబ్రాహ్మణ మండల సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కర్ణపంతులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీహరి, కోశాధికారిగా జె.నిరంజన్, ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసులు, ఎస్.నాగేష్‌లు గౌరవ అధ్యక్షుడిగా ఎం.మాధవయ్య, పీ.ఈశ్వరయ్య, సలహాదారులుగా సత్యనారాయణ, లింగం, ప్రచార కార్యదర్శులుగా హుస్సేన్, శేఖర్ లను ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా వెంకటస్వామి, మురళీ, సత్యనారాయణ, ధన్‌రాజ్, సుధాకర్, బిచ్చన్న, నిరంజన్, వెంకటస్వామిలను ఎన్నికయ్యారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మన్ననూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని వైద్యాధికారి సుధాకర్ అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలను మొత్తంగా పరిశీలించిన సిబ్బంది ఆరోగ్యపరమైన జాగ్రత్తలకు సంబంధించిన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా టాయిలెట్స్, వంట గదుల వద్ద నిల్వ ఉన్న నీటిలో క్రిమి సంహారక మందులను పిచికారీ చేశారు. విద్యార్థుల కోసం వండిన వంటలను పరిశీలించారు. అనంతరం హెచ్‌డబ్ల్యూఓ తిరుపతమ్మ సమక్షంలో వైద్యాధికారి సుధాకర్ నేతృత్వంలో విద్యార్థులకు ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధులు జ్వరం, దగ్గు, చర్మవ్యాధులు, పగుళ్లు, వళ్లు నొప్పులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మర్తమ్మ, నారాయణమ్మ, ఏఎన్‌ఎంలు పద్మ, రామలింగమ్మ, భారతి, చంద్రకళ, తిరుపతమ్మ, సరస్వతి, ఆశ కార్యకర్తలు బాలకిష్టమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కాపాడాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కాపాడాలని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీపురం గ్రామానికి వెళ్లే దారిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన భూమిని గురువారం వారు పరిశీలించారు. గతంలో కళాశాలకు 5 ఎకరాల 15 గుంటల భూమిని ప్రభుత్వ కళాశాలకు కేటాయించారని ప్రస్తుతం మూడు ఎకరాల పైన భూమిని కొందరు ఆక్రమించుకొని అందులో వ్యవసాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి కళాశాలకు సంబంధించిన భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభినయ్ విశ్వాస్ కార్తికేయ జయరాం తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో పాఠశాలకు రంగులు

మన్ననూర్: స్థానిక గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల భవనానికి హెచ్‌ఎం సిద్దార్థ మహదేవ్ ప్రోత్సాహంతో పాఠశాల ఉపాధ్యాయులు తమ స్వంత ఖర్చులతో రూ. 75,000 లతో పాఠశాలకు కొత్తగా రంగులు వేయించారు. ఎంతో చరిత్ర కలిగిన పాఠశాల భవనానికి రంగులు పోవడంతో కళాహీనంగా కన్పిస్తోంది. దీంతో హెచ్‌ఎం ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు డబ్బులు పోగు చేసుకొని రంగులు వేసి ఉదారత చాటుకున్నారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలతో పాటూ అర్హతలు కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నామన్నారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలు సంఘాల నాయకులు ఉపాధ్యాయులను అభినందించారు.



రంగులు వేయించిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



నాగర్‌కర్నూల్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్వగృహంలో ఆ పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఊర్కొండ పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పరిసరాల్లో మొక్కలను నాటారు. కొల్లాపూర్, పెంట్లవెల్లిలో బాణాసంచా కాల్చారు. అచ్చంపేట, తెలకపల్లి, వెల్దండ, చారకొండ, బల్మూరు, తిమ్మాజిపేటలో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కొల్లాపూర్‌లో నరేందర్‌రెడ్డి, రాంచందర్ యాదవ్, కాటం జంబులయ్య, వెల్దండలో ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడు, తిమ్మాజిపేట, పెంట్లవెల్లి, చారకొండ మండల అధ్యక్షులు జోగు ప్రదీప్, పోతుల వెంకటేశ్వర్లు, రవీందర్, ఊర్కొండలో కదిరి శేఖర్ యాదవ్, కొండా గిరి, తెలకపల్లిలో టౌన్ అధ్యక్షుడు బాషమోని సత్యనారాయణ, రమేష్, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన రైతులకు యూరియా అందిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

బల్మూర్: అవసరమైన రైతులకు యూరియా పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు. 'యూరియా కోసం పడిగాపులు' అనే శీర్షికతో గురువారం సాక్షిలో కథనం ప్రచురితం అయ్యింది. ఈ మేరకు ఏఓ స్పందిస్తూ మండలంలోని కొండనాగుల పీఏసీఎస్ కేంద్రంలో ఈ నెల 22న 2200 బస్తాల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. సోషల్ మీడియాల్లో వస్తున్న వదంతుల వల్ల ముందుజాగ్రత్త కోసం యూరియా నిల్వ చేసుకునేందుకు ఒక్కసారిగా పోటెత్తారని వివరించారు. దీంతో రైతులు బారులు తీరాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి రైతులకు అవసరం మేరకు యూరియా అందిస్తామన్నారు. ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.



ఏఓ నరేష్

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల వినతి

కల్వకుర్తి రూరల్/తాడూరు/వెల్దండ/కోడేరు: ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కరితంగా ఉన్న విద్యా, ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయులు అధికారులకు వినతపత్రం అందజేశారు. కల్వకుర్తిలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ అనితకు, తాడూరులో యూఎస్‌పీఎస్ ఆధ్యర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తహసీల్దార్ జయంతికి, వెల్దండలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు ,కోడేరులో ఉపాధ్యాయ సంఘాల పోరాట మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. జీఓ నంబర్ 25ను సవరించి ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తిలో బాలరాజ్, వెంకటేశ్వర్లు, నెహ్రూ ప్రసాద్, రాజు, శివశంకర్ తాడూరులో కోటీశ్వర్, రాములు, వెల్దండలో శ్రీకాంత్, ఆనంద్, లక్ష్మణ్, నాగేంద్రమ్, కోడేరులో మహేష్, భాస్కర్, కృష్ణలు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

చారకొండ: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చాటుదామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సాయి తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. చాంద్రారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు వేణుశర్మ, హరిబాబు, కొండల్, శ్రీకాంత్, రామకృష్ణ, మహేందర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలి

తెలకపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ గన్నోజు నరేష్‌చారి కోరారు. మండల కేంద్రంలో యోగా భవనంలో బీజేపీ మండల శాఖ సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రమణారెడ్డి, బాబుసాగర్, రవికుమార్‌రెడ్డి, కృష్ణయ్య, వసంతగౌడ్, బాషమోని రమేష్, రమేష్ పాల్గొన్నారు.



లింగాలలో మాట్లాడుతున్న ఆంజనేయులు

బీజేపీ బలపడుతోంది

లింగాల: రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని బీజేపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ వరికుప్పల ఆంజనేయులు అన్నారు.మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు గువ్వని నవీన్ అధ్యక్షతన స్థానిక సంస్థల మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికలపై ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ రమేష్‌రావు, నాయకులు సతేశ్వరం, మహేశ్వరం, విష్ణు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పంటల సాగుతో భూసారం



చారకొండ: రైతులు పచ్చిరొట్ట ఎరువు పంటలను సాగు చేయడంతో భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని సిర్సనగండ్ల ఏఈఓ వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో రైతు సాగు చేసిన జనుము పంటలను గురువారం పంట పొలాల్లో తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట సాగుచేసి కలియదున్నాలన్నారు. రైతు వెంకట్ రెడ్డి మూడు సంవత్సరాలుగా పచ్చిరొట్ట సాగు చేసి వివిధ పంటలు సాగుచేయడంతో అధిక దిగుబడి సాధిస్తునట్లు తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీహోమం

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి సమీపంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా గురువారం భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం వేదాంత గంగాధర శర్మ ఆధ్వర్యంలో హోమం కొనసాగింది. భక్తులకు అన్నదానం చేశారు. బిట్ల లావణ్య, రాంరెడ్డి, శిరీష, అజయ్, భక్తులు పాల్గొన్నారు.

రేపు నామాల బాలస్వామి సంస్మరణ సభ

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలోని టీఎన్‌జీఓ భవనం హాల్‌లో 26వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటలకు నామాల బాలస్వామి సంస్మరణ సభ నిర్వహిస్తునట్లు కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం మన్ననూర్‌లోని అంబేడ్కర్ గ్రంథాలయం ప్రాంగణంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2001 సంవత్సరంలో కొందరు అగ్రకుల అహంకారంతో మండుతున్న వరిగడ్డి వాములో నామాల బాలస్వామిని వేసి సజీవ దహనానికి పాల్పడ్డారని గుర్తు చేశారు. ప్రతి ఏట జూలై 17 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు కారంచేడు, చుండూరు సంఘటనలకు గానూ 'దళిత మృత వీరులను స్మరించుకుందాం' అనే కార్యక్రమాలలో భాగంగా సంస్మరణ సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రసుతం వర్షాలు కురుస్తున్నందున సెలవు రోజుల్లో కూడా యూరియా, డీఏపీ ఎరువులను అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం 1216 యూరియా బస్తాలు ఉన్నాయని కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని కోరారు.

అరుదైన ఆపరేషన్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సురక్ష పీపుల్స్ ఆస్పత్రిలో గురువారం అరుదైన ఆపరేషన్ చేశారు. కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళకు రొమ్ములో బహుళ కణితులు ఉండి ఐదేళ్లుగా బాధపడుతోంది. అచ్చంపేటలోని పీపుల్స్ ఆస్పత్రి వైద్యుడు సీఏ చైతన్యను సంప్రదించగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర పరీక్షలు చేశారు. బైలేటరల్ మల్టీపుల్ బ్రెస్ట్‌ట్యూమర్స్ అనే కణితులు ఉన్నట్లుగా గుర్తించారు. గురువారం నాలుగు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి 13 కణితులను తొలగించారు. శస్త్ర చికిత్స చేసిన వారిలో డాక్టర్ చైతన్య, అశ్విన్‌పండిట్, వెంకట్‌రెడ్డి, హలీం, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను గురువారం మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, నాయకులు రషీద్, ఎర్రశ్రీనుము దిరాజ్, పుల్లయ్య, హమీద్, భరత్‌గౌడు, రమేష్, కార్యదర్శి గిరి తదితరులు ఉన్నారు.

వృథా నీటిని అరికట్టాలి



తాడూరు: మండలంలోని పాపగల్‌లో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర అనుసరించుకొని ఉన్న బోరు దగ్గర నీరు వృథా అవుతోంది. సింగిల్ ఫేజ్ మోటార్లు అమర్చారు. కాని ఆన్‌ఆఫ్ బటన్ ఏర్పాటు చేయకపోవడంతో నిరంతరంగా నీరు వృథాగా పోతుందని స్థానికులు పేర్కొన్నారు. దీంతో ట్రాక్టర్లు, ఆటోలు, వాహనాలు కడుగుతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతుండటంతో దోమలు బెడద అధికంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది పరిశీలించి నీరు వృథాగా కాకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు.